క్లుప్తంగా

జీవాలకు పీపీఆర్ టీకాలు

అర్వపల్లి : జీవాలకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను పెంపకందారులు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో శుక్రవారం 400 గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్. పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు సమాచార పత్రాల పంపిణీ



రామన్నగూడెంలో సమాచార పత్రాలు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

అర్వపల్లి : ఎన్నికల కమిషన్ అందించిన ఓటరు సమాచార పత్రాలను బూత్‌లెవల్ అధికారులు ఓటర్లకు అందజేస్తున్నారు. శుక్రవారం రామన్నగూడెంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు సమాచార పత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నిక సందర్భంగా ఈ పత్రాలను చూపి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

తుంగతుర్తి : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శుక్రవారం గొట్టిపర్తి, రావులపల్లి, వెంపటి, దేవుని గుట్ట తండా, బండ రామారం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, కిషన్ రావు, దీప్లానాయక్ పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే..

అర్వపల్లి : తన ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలిస్తే పార్టీ మారతానని కొంతమంది తనపై తప్పుడు ప్రచారం చేయడం తగదని తుంగతుర్తి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేలు అన్నారు. శుక్రవారం రాత్రి రామన్నగూడెం, కొత్తగూడెం, వేల్పుచెర్ల, అడివెంల, కుంచమర్తి, ఉయ్యాలవాడ, తిమ్మాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు

నాగారం : తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు శాంతకుమారిఫిలిప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు లింగయ్య పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో దొనకొండ రవి, తాడూరి ఉప్పమ్మ, భిక్షంతోపాటు కొంత మంది శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నర్సింగ నాగమ్మ, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మామిడి సత్యనారాయణ, తాటిపాముల జలేందర్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోపై గీత పనివారల సంఘం హర్షం

చిలుకూరు : గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించడంపై గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కొండా కోటయ్య హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గీత కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల భూమి కేటాయింపు, రూ.4 వేల పెన్షన్, గీత కార్మికుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గీత కార్మికులు, వారి కుటుంబాల వారు ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి గీత పనివారల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

మాలధారులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

కోదాడఅర్బన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. అన్నదానానికి గుంటూరు జిల్లా గ్లోబల్ మైగ్రేషన్ కన్సల్టింగ్‌కు చెందిన యాజమాన్యం కొండవీటి సాంబశివరావు, నాగలక్ష్మి కుమారులు సుబ్బారావు, లలిత, కోటేశ్వరరావు, జ్యోతిక్షలు రూ.15,116లు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రేపాల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి చల్లా రామ్మూర్తి, దంతాల నాగయ్య, కృష్ణయ్య, చంటి, నర్సయ్య, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రామనాథం, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి



నాగారం : డి.కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, గాదరి కమల



తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు



నాగారం : పసునూర్‌లో..



మద్దిరాల : మాట్లాడుతున్న ఎస్ఏ.రజాక్

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించి మరోసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కోరారు. శుక్రవారం డి.కొత్తపల్లి, మామిడిపల్లి, ఫణిగిరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఉన్న పథకాలతోపాటు మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రజలకు రెండు పంటలకు నీరందిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దళితబంధు, ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు రుణమాఫీ, మిషన్ కాకతీయ, భగీరథ, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, కడియం పరమేశ్వర్, సర్పంచ్‌లు యారాల నర్సింహారెడ్డి, బిళ్ల పుష్పమాల, సత్తిరెడ్డి, నాయకులు బడేమియా, దోమల బాలమల్లు, ఈరేటి అంజయ్య, రవి, లింగయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న గాదరి కిషోర్‌కుమార్‌ను ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని కిషోర్ సతీమణి గాదరి కమల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేందర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కరపత్రాలు పంచుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం 9 సంవత్సరాల కాలంలోనే చేసిన ఘనత గాదరి కిషోర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికి ఉందన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తాటికొండ సీతయ్య, ఎంపీటీసీ మట్టపల్లి కవిత, లక్ష్మి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా గాదరి కిషోర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ తిమ్మాపురంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్,గ్రామ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చల్లా వేణుధర్ రెడ్డి, నర్సయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ జిల్లా డైరెక్టర్ దుగ్యాల రవీందర్ రావు, వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి, గుడ్ల వెంకన్న, కన్న వీరన్నగౌడ్, సూరినేని నర్సింహారావు, ఆకుల ఉప్పలయ్య, పాతూరి లింగారెడ్డి, మల్లు కలింగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, తీగల వెంకన్న, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : తుంగతుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిషోర్‌కుమార్‌ను గెలిపించాలని శుక్రవారం పసునూర్‌లో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కిషోర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ పాదిల రమేష్, సర్పంచ్ వేర్పుల సాలయ్య, చిత్తలూరి వెంకటేశ్వర్లు, కృష్ణ, కంచరి విజయ్, వెంకన్న, మల్లయ్య, సోమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించాలి



8వ వార్డు కుసుమవారిగూడెంలో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట : మంత్రి జగదీష్‌రెడ్డిని సూర్యాపేట నియోజకవర్గ ప్రజలందరూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూర్యాపేటలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన న్యాయవాదులు కోరారు. గత వారం రోజులుగా సూర్యాపేట పట్టణంలో వారు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం 30వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నల్లగుంట్ల అయోధ్య, సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యుడు గొండ్రాల అశోక్, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్ మాట్లాడారు. గతంలో ఉన్న శాసన సభ్యులు సూర్యాపేట అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాలుగా మంత్రి జగదీష్ రెడ్డి మనం ఊహించనంతగా సూర్యాపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తల్లమల్ల హసేన్, మోదుగు వెంకటరెడ్డి, రేగటి లింగయ్యగౌడ్, పిట్టల వెంకటేశ్వర్లు, జిలకర చంద్రమౌళి, దొంతరబోయిన నారాయణ, కంచుకోముల వెంకట్, హనుమాన్, అబ్దుల్ లతీఫ్, ఇబ్రహీం, రేగటి శంకరయ్యగౌడ్, అనుములపూరి సైదులు, తోగిటి మురళి, చిప్పలపల్లి చిరంజీవి, డప్పు వంశీ, మీసాల శ్రీనివాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

46వ వార్డులో ప్రచారం..

సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డినే గెలిపించాలని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. మంత్రి జగదీష్ రెడ్డి గెలుపును కోరుతూ శుక్రవారం పట్టణంలోని 46వ వార్డులో అధ్యక్షుడు ఆంగోతు బావు సింగ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డోర్లకు స్టిక్కర్లను అతికించి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలంతా మంత్రి జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ప్రజలు, మేధావులు ఓటేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. సూర్యాపేట పట్టణంతో పాటు నాలుగు మండలాల్లో మంత్రి జగదీష్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆంగోతు బావు సింగ్, నాయకులు మద్దూరి సుధాకర్, పెండెం విజయ్, రంగారెడ్డి, రేపాల యాదగిరి, మేడి సాగర్, వెంకట్ రెడ్డి, సంధ్య, రజిని విజయలక్ష్మి, దేవేంద్ర చారి, పద్మ, సుందర్, వినోద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలోని 30వ వార్డులో ప్రచారం చేస్తున్న న్యాయవాదులు



చివ్వెంలలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పేదలను ఏనాడూ పట్టించుకోలేదు



పార్టీలో చేరుతున్న వారిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు




సంకినేని వెంకటేశ్వర్‌రావుకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

సూర్యాపేట : మంత్రి జగదీష్‌రెడ్డి నియోజకవర్గంలో పేద ప్రజలను ఏ రోజు కూడా పట్టించుకోలేదని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 46వ వార్డు, కుడకుడ, 14, 2, 15వ వార్డులకు చెందిన సుమారు 500 మంది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పేద ప్రజలు తమ కష్టాలను తెలిపేందుకు మంత్రి క్యాంప్ ఆఫీస్‌కు పోతే, ఏ రోజు కూడా మంత్రి వారిని కలిసిన దాఖలాలు లేవని అన్నారు. మంత్రి అండదండలతోనే వట్టె జానయ్య యాదవ్ పేదల, గిరిజనుల భూములను అక్రమంగా లాక్కున్నాడని ఆరోపించారు. వట్టె జానయ్య యాదవ్ అక్రమంగా సంపాదించిన డబ్బులో మంత్రికి వాటాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శకం ముగిసిందని తెలిపారు. ఆయన చలనం లేని వ్యక్తి అని విమర్శించారు. రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.


ఓట్ల కోసం పథకాల జపం చేస్తున్నారు..

సూర్యాపేట నియోజకవర్గంలో పేదలకు పూర్తిస్థాయిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వని అసమర్థుడు మంత్రి జగదీష్‌రెడ్డి అని సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, పార్కుల ఆధునీకరణ, రోడ్ల వెడల్పు, సీసీ రోడ్ల నిర్మాణం, సద్దల చెరువు మినీ ట్యాంకు బండ్ నిర్మాణం, శ్మశాన వాటిక ఆధునీకరణ లాంటి పనులకు కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందన్నారు. అమృత్ పథకం ద్వారా సూర్యాపేట పట్టణంలో అంతర్గత రోడ్లు, డ్రైయినేజీలకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. సూర్యాపేటలో అన్ని పనులను ఒకే కాంట్రాక్టర్‌కు ఇచ్చి మంత్రి కమీషన్‌లు తీసుకున్నారని ఆరోపించారు. మంత్రి మాటలు నమ్మి ఓట్లు వేస్తే మూడోసారి మోసపోతామని అన్నారు.

గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సూర్యాపేట రూరల్ : కాసరబాదలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయిరాం



నాగారం : డి.కొత్తపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివశంకర్

సూర్యాపేట రూరల్ : ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట రూరల్ ఎస్ ఆర్. సాయిరాం అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. శాసనసభ ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడొద్దు

నాగారం : ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అవాంఛన సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగారం సర్కిల్ సీఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించి మాట్లాడారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని వ్యక్తిగతంగా కాని, రాజకీయంగా కాని రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైన గొడవలు జరిగితే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సైదులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకొస్తే మద్దతు ధర



కుంటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్

మద్దిరాల : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు కుంటపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం గోవింద్, ఏపీఎం మైసయ్య, సీసీలు నాగార్జున్ రెడ్డి, రమేష్, వీబీకేలు, రైతులు పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి కేంద్రాలకు తెస్తేనే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని జాజిరెడ్డిగూడెం క్లస్టర్ విస్తరణాధికారిణి శోభారాణి చెప్పారు. జాజిరెడ్డిగూడెంలో ఎన్‌డీసీఎంఎస్, ఉమామహేశ్వర రైతు ఉత్పత్తుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వల్లాల రమేష్, గొని వెంకన్న, పోలెబోయిన మధూకర్, లింగయ్య, మల్లేష్, నరేష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరం

- ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు
- తాగునీరు, మూత్రశాలల ఏర్పాటు
- దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు



అనంతారంలో ఏర్పాటు చేసిన ర్యాంపు

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలోకి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో సజావుగా ఓటు వేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పనకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లలో దివ్యాంగులు, వృద్ధులు ఎక్కువ మంది వీల్ చైర్లలో వస్తుంటారు. వారి కోసం కేంద్రాల వద్ద ప్రత్యేకంగా వీల్ చైర్లు, గదుల్లోకి వెళ్లడానికి ర్యాంపులు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మూత్రశాలలు, కుర్చీలు ఇలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని భవనాలకు మరమ్మతులు కూడా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 320 పోలింగ్ బూత్‌లు ఉండగా ఈసారి అదనంగా 6 పోలింగ్ బూతులు పెరిగాయి. గతంలో కంటే పోలింగ్ శాతం పెరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. సమస్యాత్మక వార్డుల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు అదనపు పోలీస్ బలగాలను మోహరించేలా పోలీస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతిదే రాజ్యం



సూర్యాపేటలో రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని.. సూర్యాపేటలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం అన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పీఎస్సార్ సెంటర్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక, ల్యాండ్, మద్యం మాఫియా ఎక్కువైందని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12సీట్లలో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నూతనకల్, మద్దిరాల, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ గెలుపును ఆకాంక్షిస్తూ మందుల సామేల్‌తో కలిసి నిర్వహించిన ప్రచార ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలోని ఇసుకను దోచుకొని ఎమ్మెల్యే గాదరి కిషోర్ వేల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓటేసి సామేల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వరరావు, పెద్దిరెడ్డి రాజా, పట్టణ అధ్యక్షుడు ఎండీ అంజద్ అలీ, శనగాని రాంబాబు గౌడ్, నేరేళ్ల మధు గౌడ్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

పిట్ట రాంరెడ్డి మద్దతు..

వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిల సూచన మేరకు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్‌టీపీ సూర్యాపేట కోఆర్డినేటర్ పిట్ట రాంరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్

బీఆర్ఎస్ 15వ వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ శుక్రవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

పెన్‌పహాడ్ : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మాజీ మంత్రి దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అనాజీపురం, దోసపహాడ్, నారాయణగూడెం, నాగులపహాడ్, అన్నారం, అనంతారం, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, అన్నారం గ్రామాల నుంచి వివిధ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు





సూర్యాపేటలోని పలు ఆలయాల్లో పూజల్లో పాల్గొన్న మహిళలు

భానుపురి : సూర్యాపేట పట్టణ వ్యాప్తంగా ప్రజలు నాగుల చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత శివాలయంతో పాటు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న నాగులమ్మ గుడిలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి దేవాలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో బారులుదీరడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.





ఆలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు, యువతులు

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కోదాడఅర్బన్ : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోదాడ అగ్నిమాపక కేంద్రం అధికారి కె.రామలింగం అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం జరిగితే ఏ విధంగా మంటలను అదుపులోకి తేవాలో ప్రత్యక్షంగా చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ ఇంజన్ పనిచేసే విధానం అందులో ఉండే పరికరాలు, వాటర్ ఫోర్స్‌ను పెంచి, మంటలను తగ్గించే విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ ఆంజనేయులు, ఫైర్‌మన్ నగేష్, విజయ్ కుమార్, వెంకన్న, రమేష్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే మద్దతు

నూతనకల్ : తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకే టీఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని టీఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కనిగంటి యల్లయ్య అన్నారు.మండల కేంద్రంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎమ్మార్పీఎస్ మండల శాఖ బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్ గెలుపుకోసం పనిచేస్తుందన్నారు. సమావేశంలో వెంకటయ్య, విజయ్, సురేశ్, జయమ్మ, ప్రవీణ్, పరమేశ్, జితేందర్ పాల్గొన్నారు.

ఆర్మీ క్విజ్ పోటీల్లో విజేతగా తేజ విద్యాలయం

కోదాడరూరల్ : కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలైన సందర్భంగా భారతీయ సైనికదళం 'బాటిల్ ఆఫ్ మైండ్స్' పేరుతో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో కోదాడకు చెందిన తేజ విద్యాలయ పాఠశాల విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా 12 నగరాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 32441 పాఠశాలలు పాల్గొన్నాయి. వాటిలో మొదటి, రెండవ దశ క్విజ్‌లలో 216 పాఠశాలలు ఉత్తమ ప్రతిభ కనబరచాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ ఆర్టిలరీ కేంద్రంలో ఫైనల్ పోటీలు నిర్వహించగా కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు సునందు, సృజన్, సహానా, రేఖశ్రీల టీం 80 మార్కులు సాధించి విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు లెఫ్టినెంట్ జనరల్ సధాన బహుమతులు అందజేసినట్లు తెలిపారు.